
సాక్షి ఒడిశా
మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.79.909లు, బంగారం 3గ్రాముల 100 మిల్లీగ్రాములు, వెండి 50 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చిట్టిపులి జననం

నందన్‌కానన్‌లో చిట్టి పులి జన్మించింది. పులుల సంఖ్య 28కు చేరుకుంది.

- 8లో



విద్యతోనే ఉజ్వల భవిష్యత్

మల్కన్‌గిరిలోని స్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

మునిగుడ పీహెచ్‌సీలో అంబులెన్స్ సేవలు



అంబులెన్స్‌ను ప్రారంభించిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుంచి 108 అంబులెన్స్ సేవలు ప్రారంభమయ్యాయి. మెడికల్ అధికారి ఆశీష్ కుమార్ పండ ముఖ్యఅతిథిగా హాజరై అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. మునిగడు పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు ఈ సేవలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ లక్ష్మణ్ బాగ్, ఎల్‌హెచ్‌వీ సొదా మిణి మల్లిక్, లాబ్ టెక్నిషియన్ జగబంధు బెహర పాల్గొన్నారు.

కాలువలో యువకుని మృతదేహం లభ్యం



సోను మృతదేహం

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి గులుముండ పంచాయతీ పరిధిలోని అచవా గ్రామం సమీపం ఉన్న కాలువలో యువకుని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. మృతుడు బిహార్ రాష్ట్రానికి చెందిన సోను కుమార్ సింహ్ (40)గా గుర్తించారు. గుణుపూర్‌లోని ప్రభుత్వ సారా విక్రయ కేంద్రంలో పనిచేస్తుండేవాడు. అయితే కొన్నాళ్లుగా ఆ పనిని విడిచి ప్లంబర్‌గా పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నట్లు సమాచారం. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఇది హత్య లేక ఇంకేదైనా కారణముందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గుణుపూర్‌లోని సైంటిఫిక్ బృందం కూడా సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ గురించి అన్వేషిస్తున్నారు.

లంచం ఇస్తేనే నష్ట పరిహారం



రైతుల నుంచి అటవీ శాఖ సిబ్బంది లంచం తీసుకుంటున్నట్లు వైరల్ అయిన దృశ్యం

రాయగడ: ఏనుగుల బీభత్సానికి పచ్చని పంటలు నష్టపోయిన బాధిత రైతులు లంచం ఇస్తేనే నష్టపరిహారం చెల్లించే ప్రక్రియకు శ్రీకారం చుడతామని ఒక అటవీ శాఖ సిబ్బంది చెప్పిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి పరిధిలో గల నియమగిరి పర్వత ప్రాంతాల్లో గత ఏడాది నవంబరు నెలలో చాటికొన, కురుసు ముహి, బెంబేరి, మాయాబలి తదితర గ్రామాల్లో ఏనుగులు చొరబడి పంటలను ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో అటవీ శాఖ అధికారులు బాధిత గ్రామాలకు వెళ్లి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో గల వివిధ పంటలు పూర్తిగా ఏనుగుల బీభత్సానికి నష్టపోయిన సంగతి తెలిసిందే. అయితే నెలలు గడుస్తున్నా నష్టపరిహారం ఇంకా అందకపోవడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీన్నే ఆసరాగా తీసుకున్న అటవీ శాఖ సిబ్బందిలో కొందరు బాధిత గ్రామాల్లో గత రెండు రోజులుగా పర్యటించి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేందుకు రంగం సిద్ధం చేసిందని, అయితే అందుకు కొంత మొత్తం ముందుగా చెల్లించాలని నమ్మించి బాధిత రైతుల నుంచి కొంత మొత్తం డబ్బులు వసూలు చేస్తున్న వీడియో వైరల్ అయ్యింది. సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్తాబవుతున్న.. శైవక్షేత్రాలు



జయపురం: గుహలో ప్రసరిస్తున్న సూర్యకిరణాలు

రాయగడ:

జిల్లాలోని ఉన్న ప్రముఖ శైవక్షేత్రాలు శివరాత్రికి ముస్తాబవుతున్నాయి. గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలోని మీనాజోలలో గల శైవక్షేత్రం చంద్రపూర్, గుడారి సమితుల సరిహద్దు అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ ఏటా శివరాత్రికి పెద్ద యాత్ర జరుగుతుంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. దక్షిణ ఒడిశా త్రివేణి సంగమంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో వంశధార, చవులధువా, ఫాలొఫాలియా నదులు కలుస్తాయి. ఎత్తయిన పర్వతాలు, రాళ్ల గుట్టల మధ్య నదినీటి ప్రవాహం వల్ల చూసేందుకు ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ప్రభుత్వం దీని ప్రాచుర్యాన్ని గుర్తించి పర్యాటక స్థలంగా అభివృద్ధి చేస్తే మరింత బాగుంటుందని ఈ ప్రాంత ప్రజలు కొరుతున్నారు.

ముస్తాబవుతున్న దేవగిరి

జిల్లాలోని కళ్యాణసింగుపూర్ లొ గల మరో శైవక్షేత్రం దేవగిరి. శివరాత్రి తొమ్మిది రోజులు ఇక్కడ భారీ ఎత్తున యాత్ర జరుగుతుంది. పరిసర ప్రాంతాలకు చెందిన వారితో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి శివదర్శనం చేసుకుంటారు. ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

గుప్తేశ్వర క్షేత్రం.. ఘన చరితకు సాక్ష్యం

జయపురం: దక్షిణ ఒడిశా జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి సమీపంలో ఒక పర్వత గుహలో వెలసి ఉన్న ప్రసిద్ధ పుణ్య శివ క్షేత్రం గుప్తేశ్వర్ స్థానిక ఘన చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. శ్రీరాముడి తపస్సుకు మెచ్చిన శివుడు ఇక్కడ కొలువుదీరినట్లు స్థల పురాణం చెబుతోంది. అందుకే ఈ కొండను రామగిరి అంటారని, ఇప్పటికీ శ్రీరాముని పాదాలు రామగిరి పూజారిపుట్ ప్రాంతంలో ఉన్నాయని అంటారు. ఇక క్రీస్తుశకం 17వ శతాబ్దంలో సూర్య వంశీయ రాజుల పాలనలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. నం దపూర్‌రాజులు జయపు రా నికి రాజధాని మార్చాక ఇక్కడ పూజలు విస్తృతమయ్యాయి.

దట్టమైన దండకారణ్యంలో శబరి నది చెంతన ఆహ్లాదకమైన ప్రకృతి ఒడిలో పది అడుగుల కై వారం, 8 అడుగుల ఎత్తు కలిగిన అపూర్వ శివలింగమే గుప్తేశ్వరుడు. 1648–1669 మధ్య కాలంలో జయపురం సామ్రాజ్యాన్ని పాలించిన రాజా వీరవిక్రమదేవ్ కాలంలో ఈ శివలింగం వెలుగు చూసింది. గొడియ పాత్రో అనే రాజ ప్రతినిధి ద్వారా రాజుకు ఇక్కడి శివలింగం మహత్యం తెలుస్తుంది. మానవ మాత్రులకు కనిపించకుండా గుప్తంగా గుహలో ఉండటం వల్ల ఆ లింగానికి గుప్తేశ్వరుడు అని నామ కరణం చేశారు. ఇక్కడ మహాశివరాత్రి నాడు పూజలు అంగరంగ వైభవంగా పూజలు జరుగుతాయి.

ప్రకృతి అందాలు..

గుప్తేశ్వర్ ప్రకృతి అందాలకు నిలయం. చెంతన గలగల పారే శబరి నది, దారి పొడుగునా నింగిని తాకే పలు రకాల వృక్షాలు, పర్వత గుహలు దర్శకులను అలరిస్తాయి. గుప్తేశ్వరుడు ఉండే గుహకు సమీపంలో అందమైన శిలలు భక్తులకు దర్శనమిస్తాయి. ఆ శిలలలో కామధేనువు ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఆ శిరముల నుంచి నీటి బిందువులు, తెల్లని పాల బిందువులు పడుతూ ఉంటాయి. గుప్తేశ్వర్ స్వామి ఉన్న గుహ చేరువున గల మార్గం అతి చిన్నది. ఆ మార్గం గుండా వెళ్తే కాశీ చేరుతారని ప్రజలు అంటారు.



రాయగడ: మీనాజోలలో పూజలందుకుంటున్న జలాధరుడు



రాయగడ: పూజలను నిర్వహిస్తున్న పూజారి



జయపురం: రామగిరి ప్రాంతం పూజారిగుడ గ్రామ ప్రాంతంలో శ్రీరాముని పాదాలు



జయపురం: మహాశివరాత్రి పూజలకు సిద్ధం చేస్తున్న గుప్తేశ్వర శివలింగం



రాయగడ: భక్తులు దిగేందుకు వీలుగా నిర్మించిన మెట్లు




రాయగడ: రాళ్ల మధ్య ఉన్న పుణ్య శైవక్షేత్రం



రాయగడ: భక్తుల తాకిడి



జయపురం: గుప్తేశ్వర చెంతన ఉన్న శబరి నది



జయపురం: ఆకట్టుకునే గుహలలో రాతి శిలలు



జయపురం: గుప్తేశ్వర గుహలో లింగ రూపంలో వెలసిన శివుడు



జయపురం: గుహలో ఉన్న శివలింగానికి వెళ్లే దారి

వేగంగా స్కూటీ నడపవద్దని చెప్పినందుకు..

వ్యక్తిపై ఇద్దరు యువకుల దాడి



దాడికి పాల్పడిన రింకు సింగ్, బిక్రమ పంగి

జయపురం: అతివేగంగా స్కూటీ నడపవద్దని చెప్పిన వ్యక్తిపై మారణాయుధాలతో ఇద్దరు యువకులు దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. అరెస్టయిన వారిలో స్థానిక బాపూజీనగర్ ఘాసీ వీధికి చెందిన రింకు ఉరఫ్ హరప్రీత సింగ్, బృందావన ఉరఫ్ బిక్రమ పంగిలు ఉన్నారన్నారు. వారినుంచి గొడ్డలిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు వెల్లడించారు. పోలీసు స్టేషన్ అధికారి వివరణ ప్రకారం.. ఈ నెల 22వ తేదీ రాత్రి దాదాపు ఎనిమిది గంటల సమయంలో కుంధార గుడ గ్రామంలో ధనుర్జయ ముధిలి (40)తన ఇంటి ముందు నిలబడి ఉన్నారు. ఆ సమయంలో రింకు, బృందావన్‌లు స్కూటీపై అతివేగంగా వచ్చారు. దీంతో వీధిలో పిల్లలు ఉన్నారని నెమ్మదిగా స్కూటీ నడపాలని ధనుర్జయ వారికి చెప్పాడు. అయితే ఇద్దరు యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయి.. కొంత సమయం తరువాత కర్రలతో వచ్చిన యువకులు ధనుర్జయ తిట్టడంతోపాటు అతనిపై దాడికి పాల్పడారు. కర్ర దెబ్బలతో ధనుర్జయ తలకు గాయమైంది. ఎడమ చెయ్యి విరిగింది. అది చూచిన స్థానికులు తీవ్రంగా గాయపడిన ధనుంజయను వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల ఆచూకీ తెలుసుకున్న పోలీసులు ఇద్దరి యువకులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఇరువర్గాల మధ్య కొట్లాట



గాయాలతో కన్నుగుడ గ్రామస్తులు

- 24 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- ఏడుగురు అరెస్టు

రాయగడ: ఇరుగ్రామాల మధ్య జరిగిన కొట్లాటలో 24 మంది గాయపడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని కాసీపూర్ సమితి రేఖాపదర్ పంచాయతీలొని బలిగుడ, కన్నుగుడ గ్రామాల ప్రజల మధ్య ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గాయపడినవారిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో చికిత్స కొసం రాయగడ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌డీపీవో గౌర హరి సాహు, కాసీపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. ఈ ఘటనలో ఏడుగురిపై కేసులు నమోదు చేసి..అరెస్టు అనంతరం కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. బలిగుడ, కన్నుగుడ గ్రామాల మధ్య ప్రధాన మంత్రి సడక్ యోజన పథకంలో భాగంగా రెండు గ్రామాలకు అనుసంధానించే రహదారి నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ముందుగా తమ గ్రామం నుంచే రోడ్డు పనులు ప్రారంభించాలని ఇరు గ్రామాల ప్రజలు పట్టుదలకు పోయారు. మాటామాటా పెరిగి ఇరు గ్రామాల ప్రజలు కర్రలతో కొట్టుకున్నారు. రెండు గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం శాంతి కమిటీని ఏర్పాటు చేసి చర్చించారు. సమస్యను పరిష్కరించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారు.

ఐదు క్వింటాళ్ల గంజాయి సీజ్



పట్టుబడిన గంజాయి బస్తాలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ అడవ పోలీసు స్టేషన్ పరిధిలో రాజఖోమా జంగిల్‌లో భువనేశ్వర్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న గంజాయి బస్తాలను పట్టుకున్నామని ఎస్సై ప్రశాంత్ పలక తెలిపారు. గంజాయి అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అడవ, మోహనా పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించగ సోమవారం వేకువజామున గులిమరా అటవీ ప్రాంతంలో రాజఖోమా జంగిల్ వద్ద ఎనిమిది బస్తాల్లో తరలించడానికి గంజాయిని సిద్ధంగా ఉంచగా.. పోలీసులు రావడంతో నిందితులు పరారైనట్టు చెప్పారు. పట్టుబడిన గంజాయిని తూకం వేయగా ఐదు క్వింటాళ్ల ఒక కిలో ఉన్నట్టు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ మార్కెట్‌లో 35 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశామన్నారు. గంజాయిని సీజ్ చేసి ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసునమోదు చేసినట్టు ఎస్సై చెప్పారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

- పోలీసు అధికారులు



పోలీసు జనసంపర్క శిబిరంలో మాట్లాడుతున్న కుంధ్ర పోలీసు అధికారి చిత్తరంజన్ ప్రధాన్

జయపురం: శాంతిభద్రతలు క్షీణించకుండా ప్రజలు సహకరించాలని పోలుసులు కోరారు. జయపురం సబ్‌డివిజన్ కుంద్రసమితి కెరామెట పంచాయతీ పరిధి కొందజోడి గ్రామంలో కొరాపుట్ జిల్లా పోలీసు అధికారులతో సోమవారం జనసంపర్క శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కొరాపుట్ పోలీసు అధికారి నారాయణ రథ్ అధ్యక్షతన జరిగిన శిబిరంలో కుంద్ర పోలీసు అధికారి చిత్త రంజన్ ప్రధాన్ జనసంపర్క శిబిర ప్రధాన ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. పోలీసు యంత్రాంగం ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఉందన్నారు. ఏ సమస్య వచ్చినా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించి సహాయం పొందవచ్చన్నారు. శాంతిభద్రతల రక్షణలో ప్రజలు పోలీసులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెరామెట పంచాయతీ సర్పంచ్ మానిక్ శాంత, గౌరవ అతిథిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ జీవణ సంగ్రామ్, నాయబ్ సర్పంచ్ మొనో శాంత, వార్డు సభ్యుడు సుజాత బొరస, సమాజ సేవకుడు భజమన శాంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించగా వందలాది మంది వైద్య పరీక్షలు జరుపుకున్నారు. ప్రజలకు కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సశ్వత నాయిక్, కొరాపుట్ పోలీసు ఆస్పత్రి ఫార్మాసిస్టు బ్రజరాజ్ నంద, వైద్య సిబ్బంది కె.బి.సరాబ్, చక్రధర జాని, కుంద్ర ఎమ్‌హెచ్‌టీ డాక్టర్ హరిశంకర సాహు, మహిళా హెల్త్ వర్కర్ ఆరతీ గొలాప్‌లు పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 252 మందికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం యువకుల మధ్య వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కొందజోడి, దొంబుపాదర్, కెరామెటి గ్రామాల యువకులు పాల్గొన్నారు. విజేత టీమ్‌లకు క్రీడా వస్తువులు అందజేశారు. అలాగే మహిళలకు, పురుషులకు వస్త్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు స్కూలు బ్యాగ్‌లు, పాఠ్య పుస్తకాలు అందించారు. శిబిర నిర్వహణలో కుంద్ర పోలీసు సిబ్బంది సహకరించారు.

బాలింకేశ్వర మందిరం పునఃప్రతిష్టాపన

రాయగడ: స్థానిక పీహెచ్‌డీ వద్ద గల బాలింకేశ్వర ఆలయ పునఃప్రతిష్టాపన ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం మందిరాభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పాటు స్థానిక దాతలు ఇచ్చిన విరాళాలతో కొత్తగా రూపుదిద్దుకున్న మందిరాన్ని పునఃప్రారంభిస్తున్నారు. ముందుగా స్థానిక జంఝావతి నదీతీరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన పురోహితులు అక్కడి నుంచి కలశాలతో నీటిని తీసుకువచ్చి మందిరం ప్రాంగణంలో నిలపడంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రత్యేక పూజలను నిర్వహించారు. వచ్చేనెల 2 వ తేదీతో ఉత్సవాలు పూర్తవుతాయి.



కొత్తగా నిర్మించిన బాలింకేశ్వర మందిరం



జంఝావతి నది వద్ద పూజలను నిర్వహిస్తున్న దృశ్యం



జంఝావతి నది వద్ద పూజలను నిర్వహిస్తున్న దృశ్యం



అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

క్లుప్తంగా

అదనంగా వసూళ్లు చేస్తే చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ డోర్ డెలివరీ పేరిట వినియోగదారుల నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. జిల్లా సప్లయ్ అధికారి, గ్యాస్ ఏజెన్సీల డీలర్లతో కలెక్టరేట్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గ్యాస్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇక నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులకు న్యాయం చేయడమే లక్ష్యంగా ఏజెన్సీలు పనిచేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి సూదికొండ 51వ సర్వే నంబర్‌లో కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి భూసేకరణ వివాదంగా మారిన విషయం తెలిసిందే. దీంతో తమకు న్యాయం చేయాలని సుమారు 120 మంది బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు వీరంతా సోమవారం ఉదయం పలాసలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కేంద్రీయ విద్యాలయానికి తాము అడ్డు చెప్పడం లేదని, అయితే తమ స్థలాలు తీసుకున్నందున న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ అనేక మంది పెద్దల స్థలాలు ఉండగా తమవే ఎందుకు తీసుకున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సూదికొండ ప్రాంతానికి చెందిన అనేక మంది బాధితులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న అభిరామ్

టెక్కలి రూరల్: మండలంలో లచ్చన్నపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న సంకేళ్లమెట్ట మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి మండలంలోని జయకృష్ణాపురం గ్రామానికి చెందిన బెండి అభిరామ్ అనే యువకుడు, తన కళాశాలలో జరుగుతున్న కార్యక్రమానికి స్నేహితుడిని తీసుకెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై నందిగాం మండలం తామరాపల్లి సోమవారం వెళ్లాడు. అనంతరం తిరిగి తన స్నేహితుడితో కలిసి వస్తుండగా సంకెళ్లమెట్ట వద్ద తన ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో అభిరామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

వివాహిత ఆత్మహత్య



సోంపేట: మండలంలోని బుసాభద్ర పంచాయతీ కాలనీలో వివాహిత కౌసల్య రాలో (30) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. బారువ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పంచనన్న రాలో తన మొదటి భార్య మృతి చెందడంతో ఈదుపురం గ్రామానికి చెందిన కౌసల్య రాలోను వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లి చేసుకున్నప్పటినుంచి కౌసల్యను భర్త వేధిస్తుండేవాడు. ఇటీవల గొడవలు మరింతగా పెరగడంతో, సోమవారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వీరికి పిల్లలు లేరు. కౌసల్య రాలో సోదరి కున్ని రాలో ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేశారు. భర్త పంచనన్న రాలోను అదుపులోకి తీసుకున్నారు.

సౌదీలో మత్స్యకారుడు మృతి



మృతుడు కొరివి రామారావు

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ గ్రామానికి చెందిన కొరివి రామారావు (47) ఆదివారం రాత్రి కడుపు నొప్పితో సౌదీ అరేబియాలో మృతి చెందాడు. ఆ మేరకు తమకు సమాచారం ఇచ్చారని మృతుని సోదరుడు శ్రీనివాసరావు తెలిపారు. రామారావు మూడు నెలల కిందటే ఉపాధి కోసం సౌదీ వెళ్లారు. మృతుడికి భార్య పోలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ డిమాండ్‌తో 28న ఆందోళన



జగన్నాథ్ సాగర్ ట్రస్ట్ సభ్యుల సమావేశం

జయపురం: జయపురంలోని చారిత్రక జగన్నాథ్ సాగర్ పునరుద్ధరణ డిమాండ్‌తో జగన్నాథ్ సాగర్ ట్రస్టు ఈ నెల 28న శాంతియుతంగా ఆందోళన జరిపేందుకు సిద్ధమైంది. సోమవారం స్థానిక జయనగర్ శిశు ఉద్యానవనంలో జగన్నాథ్ సాగర్ ట్రస్ట్ అత్యవసర సమావేశం జరిగింది. ట్రస్టు అధ్యక్షుడు రజనీకాంత నాయిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 28న ఆందోళన జరపాలని నిర్ణయించారు. సాగర్ పునరుద్ధరణ పనులు 10 రోజుల్లో ప్రారంభించాలని కోరినా పనులు ప్రారంభించలేదని ట్రస్టు అధ్యక్షుడు ఆరోపించారు. జగన్నాథ్ సాగర్ పనులు వెంటనే చేపట్టాలని అధికారులకు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే పునరుద్ధరణ పనులతో పాటు సాగర్ సౌందర్యీకరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాశీనగర్‌లో రైతుల ఆందోళన



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ ప్రాంతంలో వేలాది క్వింటాళ్ల ఖరీఫ్ ధాన్యం ప్రభుత్వ కొనుగోలు చేయకపోవడంతో కాశీనగర్–గుణుపురం రోడ్డులో సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ధాన్యం కొనుగోలులో మిల్లర్ల టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో రోడ్డు పక్క, పొలాల్లో ధాన్యం బాస్తలు నిల్వ ఉంచుతున్నారు. గజపతి జిల్లాలో ఆకాల వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఆందోళన కాశీనగర్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగింది. మధ్యాహ్నం కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ అనుప్ పండా కాశీనగర్‌లో ఆందోళన జరుపుతున్న రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. కాశీనగర్ బీడీఓ డంబుధర మల్లిక్, తహసీల్దార్ సుధీర్ కుమార్ నందో, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కేదార్ శోబోరో, కాశీనగర్ నాగరిక మహాసభ అధ్యక్షుడు ప్రశాంత్ మిశ్రా, ఐఐసీ సునీల్‌కుమార్ బెహరా తదితరులు హాజరయ్యారు. ఫిబ్రవరి వరకు ఇంకా 3600 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయకుండా మిగిలి ఉన్నాయని అధికారులకు రైతులు తెలియజేశారు. వచ్చే మంగళవారం లోగా కాశీనగర్ ఎస్‌ఏసీ, కాశీనగర్ బ్లాక్‌లో కొనుగోలు చేయకుండా ఉండిపోయిన ధాన్యం తీసుకుంటామని సమావేశంలో అధికారులు నిర్ణయించడంతో రైతులు ఆందోళన విరమించారు. మండీల వద్ద ఎఫ్‌ఏ క్యూ ధాన్యం పరీక్షలు చేసిన తరువాత మిల్లర్లుకు ధాన్యం పంపిస్తే.. వారు తిరిగి పరీక్షలు జరిపి ధాన్యం పంపడాన్ని రైతులు వ్యతిరేకించారు. డిమాండ్‌లను ఆర్.ఎం.సి సెక్రటరీ, సబ్ కలెక్టర్ అంగీకరించడంతో రైతులు ఆందోళన విరమించారు.

చిత్రకొండ సమితిలో గ్రీవెన్స్‌సెల్



హాజరైన చిత్రకొండ పరిధిలోని ఉద్యోగులు

- 42 వినతుల స్వీకరణ

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు 42 వినతులను అధికారులకు అందజేశారు. వినతులను పరిశీలించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వినోద్ పటేల్, సబ్‌కలెక్టర్ దుర్యోధన్ బోయి, చిత్రకొండ సమితి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు .



వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్



వినతి పత్రాన్ని అందజేస్తున్న మహిళ

మాజీ గ్రామ వలంటీర్‌పై దాడి

- దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్త



అప్పన్నను పరామర్శించి ధైర్యం చెబుతున్న పేరాడ తిలక్

టెక్కలి/టెక్కలి రూరల్: మండలంలోని చాకిపల్లి గ్రామంలో మాజీ గ్రామ వలంటీర్ జలుమూరు అప్పన్నపై అదే గ్రామానికి చెందిన పంగ వెంకట్రావు సోమవారం దాడికి పాల్పడ్డాడు. ఆస్తి తగాదాను అదునుగా చేసుకుని అదే స్థలంలో కోళ్లగూడు ఉంచాడనే నెపంతో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలతో అప్పన్న టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామంలోని కొంతమంది టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే వెంకట్రావు తనపై దాడి చేసేందుకు పన్నాగం పన్నాడని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని కోరారు. అయితే ఇదిలా ఉండగా అప్పన్న తనపై దాడి చేశాడంటూ వెంకట్రావు సైతం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

అండగా ఉంటాను.. అధైర్య పడొద్దు

టీడీపీ కార్యకర్త దాడిలో గాయపడిన మాజీ వలంటీర్ జలుమూరు అప్పన్నను వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పన్నను పరామర్శించి దాడికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. టెక్కలి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దాడికి పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. దాడికి గురైన ప్రతి కార్యకర్తకూ అండగా నిలబడి న్యాయ పోరాటం చేస్తానని భరోసానిచ్చారు. ఆయనతో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ చుక్క గున్నమ్మ, సర్పంచ్‌లు ఎం.శంకర్, కె.కామేష్, వి.తవితయ్య, నాయకులు బి.భాస్కరరావు, పి.శ్రీను, సత్తారు సత్యం తదితరులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



రమేష్‌నాయుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని బలగ టీపీ స్టేట్ కాలనీలో మజ్జి రమేష్‌నాయుడు (34) అనే యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు వివరాలు వెల్లడించారు. మృతుడికి 14 ఏళ్ల క్రితం రాయగడకు చెందిన శశి అనే యువతితో వివాహమైంది. వీరికి ఏడో తరగతి చదువుతున్న కుమార్తె, ఐదో తరగతి చదువుతున్న కుమారుడున్నారు. టీపీస్టేట్ కాలనీలో కుటుంబంతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. రమేష్‌నాయుడుకు మద్యం అలవాటుండడంతో ఎప్పటికప్పుడు భార్యను అనుమానించి వేధించేవాడు. దీనిపై అప్పట్లో మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు సైతం చేసింది. ఈ క్రమంలో భర్త పెట్టే బాధలు భరించలేక సంవత్సరం క్రితం శశి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అనంతరం ఇరుపక్కల పెద్దలు నచ్చజెప్పడంతో గొడవలు సద్దుమణిగాయి. కాగా ఈ ఏడాది జనవరి 3వ తేదీ రమేష్‌నాయుడు మద్యం సేవించి ఇంటికొచ్చి భార్యను కొట్టడంతో మరలా రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఆదివారం మళ్లీ రమేష్ మద్యం సేవించి వచ్చి గొడవపెట్టాడు. దీంతో ఇంటి ఓనర్ 100కు ఫోన్‌చేసి ప్రతిరోజూ న్యూసెన్స్ జరుగుతోందని చెప్పడంతో పోలీసులొచ్చి భార్యభర్తలకు సర్దిచెప్పి వెళ్లిపోయారు.

– ఏం జరిగింది..?

కాగా సోమవారం ఉదయం రమేష్ హడ్కో కాలనీ నివాసముంటున్న తల్లి వద్దకు వెళ్లి రూ.100లు అడిగాడు. అనంతరం మద్యం బాటిల్‌తో ఇంటికొచ్చి గొడవపడ్డాడు. అయితే పిల్లలు స్కూల్‌కు వెళ్లిన అనంతరం శశి పనిమీద బయటకు వెళ్లింది. అనంతరం ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు బిగించి ఉండడంతో తలుపులపై గట్టిగా కొట్టింది. ఎంతకీ తెరవకపోవడంతో హడ్కో కాలనీలో ఉంటున్న అత్త దివ్య వద్దకు వెళ్లి విషయం చెప్పింది. అనంతరం ఇద్దరూ వచ్చి సైడ్ డోర్ తీసి చూడగా అపస్మారక స్థితిలో రమేష్‌నాయుడు పడిపోయి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారమందించగా క్లూస్‌టీమ్‌తో సహా వచ్చిన సీఐ ఈశ్వరరావు, సిబ్బంది చుట్టుపక్కల పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. రూమ్‌లో ఫ్యాన్లు లేకపోవడం, మృతుని మెడ కుడివైపు నుంచి ఎడమ భాగం వైపు బాగా ఒత్తినట్లు ఎరుపు మార్కింగ్ ఉండడం (తాడుతో లేదా చున్నీతో బిగించినట్లు), కుడివైపు రిబ్స్ మీద గీతలుండడం గమనించారు. మృతుని తల్లి దివ్య తన కోడలు శశిమీద అనుమానముందంటూ చెప్పడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

నందన్‌కానన్ జూలో చిట్టి పులి జననం



శిశువుతో తల్లి పులి అంకిత

భువనేశ్వర్: నందన్ కానన్ జంతు ప్రదర్శనశాలలో పులి శిశువు జన్మించింది. 13 ఏళ్ల అంకిత పులికి ఇది పుట్టింది. దీంతో నందన్ కానన్‌లో పులుల సంఖ్య 28కి చేరుకుంది. తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు నందన్ కానన్ అధికారుల సమాచారం.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న బీడీఓ రీనా, అధికారులు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి కార్యాలయంలో సోమవారం జరిగిన వినతుల స్వీకరణలో వివిధ గ్రామాలకు చెందిన వారు 43 సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. 27 సామూహిక సమస్యలు, 16 వ్యక్తిగత సమస్యలుగా గుర్తించారు. స్వీకరించిన సమస్యలను సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించాలని ఏడీఎం నవీన్ చంద్ర నాయక్ ఆదేశించారు. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండొ, డీఎఫ్‌ఓ అన్నా సాహెబ్, బీడీఓ రీనా ప్రధాన్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

సోంపేట: మండలంలోని సుంకిడి పంచాయతీ సవర కొరంజిభద్ర గ్రామంలో ఒక ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సవర లక్ష్మి ఇంట్లో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లు, సమీపంలోని ఆవులశాల పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ధాన్యం, సర్టిఫికెట్లు, నగదు, బంగారం తదితర విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో సోంపేట అగ్నిమాపకశాఖాధికారి ఎస్.మోహనరావు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గుడి తొలగింపు

- అధికారులతోభక్తుల వాగ్వాదం

టెక్కలి రూరల్: స్థానిక పట్టుమహాదేవి కోనేరు గట్టు అభివృద్ధిలో భాగంగా చెరువు గట్టుపై ఉన్న ఆక్రమణలు తొలగించే కార్యక్రమాన్ని అధికారులు సోమవారం చేపట్టారు. దీనిలో భాగంగా నిర్మాణంలో ఉన్న మా బంకేశ్వరి అమ్మవారి గుడిని తొలగించారు. దీంతో టెక్కలిలోని చిన్న చేరివీధికి చెందిన సుమారు 30 మంది భక్తులు అక్కడికి చేరుకుని పనులను అడ్డగించారు. తమ దేవత గుడిని తొలగించడం సరికాదన్నారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావుతో వాగ్వాదానికి దిగారు. తమ పూర్వీకుల నుంచి గట్టుపై ఉన్నటువంటి రావి, వేప, మర్రిచెట్లను కలిపి అమ్మవారిగా పూజిస్తున్నామన్నారు. ఏడాది క్రితం చందాలు వేసుకొని గుడి నిర్మాణ పనులు చేపట్టామని తెలియజేశారు. తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గుడి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అయితే చెరువు గట్టు అభివృద్ధిలో భాగంగా ఆక్రమణలో ఉన్న కొంత భాగమే తొలగించామని అధికారులు తెలిపారు.

విద్యతోనే ఉజ్వలభవిష్యత్



వేదికపై సబ్‌కలెక్టర్ వేద్బర్ పయరదన్ తదితరులు



నృత్యప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలోని డీఎన్‌కే కూడలి వద్ద ఉన్న శరతజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ పయరదన్ మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. ప్రతిఒక్కరూ చదువుపై శ్రద్ధ చూపించి జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. బీఎస్‌ఎఫ్ డిప్యూటీ కమాండర్ శుభంజన్ మహాపాత్రో మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. చదువులో ఉత్తమ స్థానంలో నిలిచి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు సుబ్రత్ కుమార్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

వినూత్న నిరసన

- ఇళ్ల పట్టాలు కేటాయించాలని బస్తీ వాసుల ఆందోళన



అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బస్తీ సురక్షా మంచ్ అధ్యక్షుడు సుజిత్

పర్లాకిమిడి: పర్లాకిమిడి పురపాలక సంఘం ఎదుట బస్తీ వాసుల సురక్షా మంచ్ తరపున విభిన్న తరహాలో సోమవారం నిరసన తెలిపారు. పురపాలక సంఘంలో ఒకటో వార్డు, 12వ వార్డు సంజయ్ గాంధీ కాలనీ వాసులు కంచాలు పట్టుకుని మున్సిపల్ కార్యాలయం ఆందోళన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్ల కిందట బస్తీ వాసులుకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు. ఇంతవరకూ పట్టాలు మంజూరు చేయలేదని బస్తీవాసుల సురక్షా మంచ్ నాయకుడు సుజిత్, జాస్మిన్ షేక్ అన్నారు. బస్తీవాసులంతా ఏకమై కంచాలు పట్టుకుని వాయిస్తూ పురపాలక ప్రతినిధులు, అధికారులను నిద్రలేపుతున్నామని జాస్మిన్ షేక్ అన్నారు. అనంతరం పురపాలక అధికారులకు బస్తీ సురక్షా మంచ్ తరపున వినతిపత్రాన్ని సంఘం అధ్యక్షుడు సుజిత్ అందజేశారు. తమ సమస్యలు ఇప్పటికైనా పట్టించుకోకుంటే భవిష్యత్‌లో ఆందోళన ఉద్ధృతం చేస్తామని బస్తీ వాసులు అన్నారు.

శిశు ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మహిళలు

మల్కన్‌గిరి: శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని వక్తలు అన్నారు. మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితిలో ఐటీసీ లిషన్ సహకారంతో ఐజీజీడి ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో బాలింతలు, శిశుఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామీణా ప్రాంతాల్లో ప్రజారోగ్యం మెరుగుపరిచేందుకు ప్రతిఒకరు వ్యక్తిగతంగా, సామూహికంగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో పోడియా సర్పంచ్ గంగా కారమ్, సామాజిక కార్యకర్త ఎన్.రాఘవరావు, పోడియా సమితి అధ్యక్షుడు పి.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్ గరడమా పంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ ముఖిపరిపాలన, గ్రీవెన్సు సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. గ్రీవెన్సు సెల్‌కు కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్, ఎస్పీ జితేంద్రకుమార్‌పండా, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్ తదితరులు హాజరయ్యారు. ఒకప్పుడు నక్సల్ ప్రభావిత ప్రాంతమైన గరడమా, దమ్మాదువా, కటమా, పాణిగండ పంచాయతీల నుంచి దాదాపు 81 వినతులు అందాయి. వాటిలో 6 వినతులు కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కరించారు. వ్యక్తిగతం 42, గ్రామ సమస్యలు 39 ఉన్నాయి. ఈ గ్రీవెన్సు సెల్‌లో ఎక్కువగా పీఎం ఆవాస్ యోజనా, రోడ్లు, తాగునీరు, ఇళ్ల పట్టాలు, ఉపాధి పథకం, సామాజిక ఫించన్లపై అభియోగాలు అందాయి. మోహనా తహసీల్దార్ చక్రధర్ పాడి, సీడీఎంఒ ఎం.ఎం.అలీ, స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతెంత..?



పాతపట్నం నుంచి మెళియాపుట్టి వచ్చే ఆల్ ఆంధ్రా రహదారిలో ఇటీవల సుమారు రూ.56 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. దీంతో ఆయా పనులను మెళియాపుట్టి మండలంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. అంచనా ప్రాప్తికి కొలతల ప్రకారం పనులు చేశారో.. లేదోనని నాణ్యతను తనిఖీ చేశారు. అలాగే సుందరాడ గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న బెర్మ్‌లను పరిశీలించి అధికారులను ప్రశ్నించారు. ఉపాధి అధికారులతో మాట్లాడి ఉపాధి నిధులతో రహదారులకు ఇరువైపులా మట్టివేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు ఆర్‌ఎండబీ ఎస్ఈ జాన్ సాగర్, ఈఈ రవినాయక్, డీఈ ఎంఎల్‌వీ సాగర్, జేఈలు నాయుడు, యోగి, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా ఉన్నారు. – మెళియాపుట్టి

నలుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్టు

- 21.610 కేజీల గంజాయి స్వాధీనం
- ఒడిశా నుంచి తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వి.వెంకట అప్పారావు, పక్కనే సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలించేందుకు ప్రయత్నించిన నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒడిశాలోని గజపతి జిల్లా ఆటలిమా గ్రామానికి చెందిన అంటూని బీర అనే వ్యక్తి మహారాష్ట్రలోని జల్నా ప్రాంతంలో గంజాయి వ్యాపారం చేస్తున్న అశోక్ హివాల్ అలియాస్ రాజుకి గంజాయి సరఫరా చేయడానికి పూనుకున్నాడు. దీనికోసం ఒక ట్రిప్పుకి రూ.5 వేలు చొప్పును తీసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీనిలో భాగంగా ఒడిశాలోని కొండ ప్రాంతాల్లో 21.610 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన తపన బీర్ సాయంతో ఒడిశా నుంచి ఆంధ్ర తరలించాలని ప్లాన్ చేశాడు. అనంతరం ఆంధ్రా నుంచి ఆటలిమా గ్రామానికి చెందిన ఆకాష్ బీర్, గజపతి జిల్లా అడవ పీఎస్ మండిమీరా గ్రామానికి చెందిన పిల్కా బర్ధాన్‌లతో మహారాష్ట్ర తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈ మేరకు సోమవారం అంటూని బీర్, తపన బీర్‌లు జాతీయ రహదారి–16 మీదుగా సోమవారం ఆంధ్రకు గంజాయి తీసుకొచ్చేందుకు పయనమయ్యారు. ఆ సమయంలో కవిటి పోలీస్‌స్టేషన్ పరిధి ఆర్.బెలగాం ఫ్లై ఓవర్ అండర్ పాస్ కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వారి సమాచారంతో మహారాష్ట్ర తరలించేందుకు సిద్ధంగా ఉన్నటువంటి మరో ఇద్దరిని పట్టుకున్నారు. ఈ ఘటనలో నిందితుల నుంచి 21.610 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, కవిటి ఎస్‌ఐ రవివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైక్, వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

• ఇద్దరికి గాయాలు



లక్ష్మణ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ వద్ద సోమవారం వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీ కొనగా జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండకెంగువ గ్రామానికి చెందిన బెవర లక్ష్మణ(40),బెవర కృష్ణ,బెవర గురుమూర్తి కలిసి వారి కళ్లం నుంచి ఆవుపాలు పట్టుకుని ద్విచక్రవాహనంపై గ్రామంలోకి వెళ్తున్నారు. ఇంతలో అదే గ్రామం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న వ్యాన్ వారి బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో లక్ష్మణకు, తమ్ముడు కృష్ణకు తీవ్రగాయాలవగా గురుమూర్తికి స్వల్పగాయమైంది. స్థానికులు ప్రథమ చికిత్స నిమిత్తం ముగ్గురిని రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాడంగి సీహెచ్‌సీకి తరలించగా అక్కడ పరిస్థితి విషమించడంతో లక్ష్మణ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఎస్సై వి.ప్రసాదరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాద విషయాలు తెలుసుకుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు లక్ష్మణకు భార్య లక్ష్మీ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష

తెర్లాం: పోక్సో కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి సోమవారం తీర్పు వెలువరించినట్లు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తమ్మయ్యవలస గ్రామానికి చెందిన బొమ్మాళి అనిల్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. ఆ యువతి పెళ్లి చేసుకోమని కోరగా తిరస్కరించడంతో 2019లో తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో అనిల్‌పై పోక్సో కేసు నమోదైంది. దీనిపై అప్పటి తెర్లాం ఎస్సై నవీన్‌పడాల్ కేసు నమోదు చేయగా, బొబ్బిలి రూరల్ సీఐ బీఎండీ ప్రసాద్ కేసు దర్యాప్తు చేశారు. కేసు విచారణ అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెలువరించారు.

రెండు కేసుల్లో ఇద్దరికి 6 నెలల జైలుశిక్ష

గంట్యాడ: రెండు కేసుల్లో ఇద్దరు వ్యక్తులకు ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు ఎస్సై సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం 2018వ సంవత్సరంలో మండలంలోని లక్కిడాం గ్రామంలో ఉపాధి హామీ పనికి వెళ్తున్న మహిళను అడ్డగించి మెడలో రెండున్నర తులాల పుస్తెలతాడును లాక్కుపోయిన కేసులో, జగ్గాపురంలో రాత్రి ఇంట్లో ప్రవేశించి పుస్తెలతాడు దొంగలించిన కేసులో గుమ్మడి సురేష్, కోమటిపల్లి శ్రీను అనే వ్యక్తులకు విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ బుజ్జి పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసుల్లో ప్రాసిక్యూషన్ తరఫున శాంతిగౌతమి వాదించారు.

రేకులషెడ్డు కూల్చివేతలో ఇరువర్గాలపై కేసు

బొండపల్లి: మండలంలోని గొల్లలపేట గ్రామంలో రేకుల షెడ్డు కూల్చివేసిన ఘటనకు సంబంధించి ఇరు వర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈనెల 22 శనివారం గ్రామానికి చెందిన పీతల గుర్రయ్య రేకుల షెడ్డును గ్రామానికి చెందిన పీతల రాము కూల్చివేసినట్లు ఫిర్యాదు చేయగా..తాము కూల్చివేయలేదని గుర్రయ్యపై రాము ఫిర్యాదు చేయడంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

550 క్యూసెక్కుల సాగు నీరు సరఫరా



కుడికాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువల నుంచి 550 క్యూసెక్కుల సాగునీటిని ఆయకట్టుకు సరఫరా చేస్తున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో 10వేల ఎకరాల్లో ఆరుతడి పంటల సాగుకు వీలుగా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నామన్నారు. సాగునీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• మహాశివరాత్రి జాతరకు ముస్తాబైన రామతీర్థం
• సుమారు లక్షకు పైగా తరలిరానున్న భక్తులు
• ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
• ప్రత్యేక ఆకర్షణగా బోడికొండపై అఖండ శిఖరదీపం
• అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు



విద్యుత్ వెలుగులతో మెరిసిపోతున్న రామతీర్థం దేవస్థానం

జాగరణకు వేళాయె..!

నెల్లిమర్ల రూరల్:

ఉత్తరాంధ్రలో అతి పెద్ద పుణ్యక్షేత్రం రామతీర్థం. మూడు జిల్లాల భక్తుల అపార నమ్మకం రామక్షేత్రం. వైష్ణవ దేవాలయంగా ప్రసిద్ధికెక్కినా ప్రతి ఏటా జరుగుతున్న శివరాత్రి జాతరే రామక్షేత్రానికి ప్రత్యేకం. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి ఉత్సవాలు ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా జరుగుతున్నప్పటికీ హాజరైన భక్తుల సంఖ్య అంతంత మాత్రమే. కానీ శివరాత్రికి రెండు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాలకు మాత్రం విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా రామక్షేత్రానికి విచ్చేస్తారు. తొలి రోజు రాత్రంతా స్వామివారి క్షేత్రంలో దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో జాగరం ఉంటారు. మరుసటి రోజు ఉదయం రామకోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా శ్రీరాముడిని అనంతరం క్షేత్ర పాలకుడైన ఉమాసదాశివ స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

దేవాదాయ శాఖ ఏర్పాట్లు

భక్తులకు రామతీర్థం ఆలయంలో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం రూ.50, అలాగే ఉమాసదాశివ ఆలయంలో ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం రూ.50గా కల్పిస్తున్నారు. భక్తుల కోసం 25వేల లడ్డూ ప్యాకెట్లు, పులిహోర ప్రసాదాన్ని సిద్ధం చేశారు. అలాగే ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకుని చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. క్యూలలో తాగునీరు, మజ్జిగ, చిన్నపిల్లలకు పాలు పంపిణీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇప్పటికే దేవస్థానానికి విద్యుత్ వెలుగుల అలంకరణ పూర్తయింది. శివాలయం, ప్రధాన ఆలయంతో పాటు బోడికొండ మెట్ల మార్గంలోనూ ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేశారు. పుష్కర ఘాట్‌వద్ద స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేశఖండన శాల వద్ద తోపులాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ టెంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. కొండవెలగాడ, సతివాడ పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించనున్నారు.

రామతీర్థానికి ఇలా చేరుకోవాలి

జిల్లా కేంద్రం విజయనగరానికి 13కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉండగా నెల్లిమర్లకు తూర్పుదిక్కున ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. విజయనగరం–శ్రీకాకుళం వయా నెల్లిమర్ల రహదారిలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. ఈ క్షేత్రానికి చేరుకోవడానికి విజయనగరం కోట నుంచి నేరుగా ప్రైవేట్ వాహనాలు ఉంటాయి. అలాగే శ్రీకాకుళం నుంచి వచ్చిన భక్తులు రణస్థలం మార్కెట్ వద్ద దిగి సతివాడ–నెల్లిమర్ల వాహనాలను ఆశ్రయించవచ్చు. రణస్థలం నుంచి రామతీర్థం 18కిలోమీటర్ల దూరం వస్తుంది. జాతర సందర్భంగా విజయనగరం, రణస్థలం నుంచి ప్రతి పది నిముషాలకు ఒక బస్సు ప్రయాణికులకు సేవలందిస్తుంది.



సిద్ధమైన లడ్డూ ప్రసాదం



తూర్పు రాజగోపురం వద్ద టెంట్లు ఏర్పాటు

సర్వం సిద్ధం

బుధవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే లక్షలాది మంది యాత్రికులు, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా దేవాదాయశాఖతో పాటు ఇతర శాఖలు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశాయి. తాగునీరు, విశ్రాంతి షెల్టర్లు, ప్రత్యేక క్యూలు, మరుగుదొడ్ల నిర్వహణ, రవాణా తదితర సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పలు స్వచ్ఛంద సేవా సంస్థలు సేవలందించేందుకు సిద్ధమయ్యాయి. గత ఏడాదిలా ఈ సారి కూడా సుమారు లక్షకు పైగా భక్తులు రావచ్చునని పోలీస్, దేవాదాయ, రెవెన్యూ అధికారులు అంచనా వేస్తున్నారు. శ్రీకాకుళం నుంచి 30 ఆర్టీసీ బస్సులు, విజయనగరం నుంచి 40 ఆర్టీసీ బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తాయి.

ప్రత్యేక ఆకర్షణగా పర్వతంపై శిఖరదీపం

శివరాత్రి పర్వదినాన తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వరుని పర్వతంపై మూడు రోజుల పాటు ఏ విధంగా శిఖరజ్యోతిని వెలిగిస్తారో..రామతీర్థం బోడికొండపై కూడా గడిచిన ఐదేళ్ల నుంచి శిఖర జ్యోతిని వెలిగిస్తున్నారు. ఏటా శిఖర జ్యోతి ప్రజ్వలన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. శిఖరజ్యోతిని వెలిగించేందుకు అవసరమైన వనరులను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తమ సొంత నిధులతో సమకూర్చారు. బుధవారం రాత్రి 7గంటల సమయంలో ప్రత్యేక పూజల నడుమ శిఖర జ్యోతిని వెలిగిస్తారు.

పటిష్ట పోలీస్ బందోబస్తు



మహాశివరాత్రి జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. అల్లరు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను నియమించాం. ఐదుగురు సీఐలు, 22 మంది ఎస్సైలు, 54 మంది ఏఎస్సైలు, హెచ్‌సీలు, 94 మంది కానిస్టేబుళ్లు, 20 మంది మహిళా కానిస్టేబుళ్లు, ఆరుగురు హోంగార్డులు, ఎస్టీఎఫ్, మూడు రోప్ పార్టీలతో జాతర సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

– వకుల్ జిందల్, ఎస్పీ, విజయనగరం

భక్తులకు ఇబ్బందులు కలగకుండా...



జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. క్యూలో ఉండే చిన్నపిల్లలకు పాలు, భక్తులకు మంచినీరు సరఫరా చేస్తాం. ప్రసాదం కౌంటర్ వద్ద భక్తుల రద్దీ దష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశాం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎటువంటి వీఐపీ పాస్‌లు జారీ చేయలేదు. జాతర విజయవంతానికి అన్ని శాఖల సహకారం కోరాం. బోడికొండపైకి వెళ్లే భక్తులు జాగ్రత్తలు పాటించి దేవస్థానానికి సహకరించాలి.

– శ్రీనివాసరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం

రామతీర్థంలో ఏర్పాట్ల పరిశీలన



రామతీర్థంలో బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. రామతీర్థంలో బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ముందుగా సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతరకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. విజయనగరం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులకు కల్యాణ మంటపం ప్రాంగణంలో, శ్రీకాకుళం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులకు ప్రాథమిక పాఠశాల వద్ద పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ కోసం సీతారామునిపేట, దన్నానపేట జంక్షన్‌ల వద్ద ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రామాలయం, శివాలయంతో పాటు రామకోనేరు, ప్రసాదాల పంపిణీ కేంద్రాల వద్ద మూవింగ్ పార్టీలుగా బందోబస్తును విభజించామని, అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, దొంగతనాలు, ఈవ్‌టీజింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా మఫ్టీలో సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ, ఎస్బీ సీఐలు లీలారావు, చౌదరి, ఎస్ఐ గణేష్, ఈఓ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లది కీలకపాత్ర

• జిల్లా రెవెన్యూ అధికారి హేమలత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత

పార్వతీపురంటౌన్: స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లది కీలకపాత్ర అని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత స్పష్టం చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. జవాబుదారీతనం కలిగి సాధారణ పరిశీలకుల నియంత్రణ, పర్యవేక్షణలో సూక్ష్మ పరిశీలకులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. సూక్ష్మ పరిశీలకులు గుర్తించిన అంశాలను సాధారణ పరిశీకులకు సీల్డ్ కవర్‌లో అందించాలని ఆమె పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 27న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. దీనికోసం నియమించిన పరిశీలకులు ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పర్యవేక్షించవలసి ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన జరగకుండా చూడడమే కాకుండా, ఉల్లంఘన జరిగితే, ఆ సమాచారాన్ని సీల్డ్ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. ప్రతి పరిశీలకుడు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలను తు,చ తప్పక పాటించాలని, అందువల్ల ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన చేసుకుని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో సూక్ష్మ పరిశీలకుల విధులు, బాధ్యతలపై మెటీరియల్ ఇప్పటికే అందజేశామన్నారు. దాన్ని క్షుణ్ణంగా పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు రోజు నుంచే సమర్థవంతంగా విధులను నిర్వర్తిస్తూ, విజయవంతం చేయాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూక్ష్మ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో క్రమశిక్షణ ముఖ్యం

• ఏఆర్ పునశ్చరణ ముగింపు వేడుకల్లో ఎస్పీ వకుల్ జిందల్



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ మొబిలైజేషన్ ముగింపు కార్యక్రమంలో గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్‌శాఖకు అత్యంత ముఖ్యమైనదని అందులోనూ ఆర్మ్‌డ్ రిజర్వ్‌కు కీలకమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో సోమవారం ఏఆర్ సిబ్బంది 14 రోజుల మొబిలైజేషన్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏఆర్‌సిబ్బంది పరేడ్‌ను తిలకించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ కీలకమన్నారు. నిరంతరం వెపన్స్‌తోనే సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని, అలాగే ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరి దృష్టి పోలీస్‌శాఖపైనే ఉంటుందని, ప్రజలు అనునిత్యం మన తీరును గమనిస్తూ ఉంటారని, అందుకు పోలీసులు మార్గదర్శకంగా ఉండాలని ఎస్పీ హితవు పలికారు. విధి నిర్వహణలో క్రమ శిక్షణ ఎంతో అవసరమన్నారు. దాన్ని ఉల్లంఘిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల భద్రత, శాంతి భద్రతల విషయంలో ఏఆర్ సిబ్బందే కీలక పాత్ర పోషిస్తున్నారని ఎస్పీ అన్నారు. ఈ పునశ్చరణ తరగతులలో వీఐపీల భద్రత, ఫైరింగ్, మాబ్ ఆపరేషన్, వ్యక్తిత్వ వికాసం, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, అలాగే అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ చేయడం, రైట్ గేర్ ఆపరేషన్, యోగా వంటి అంశాల్లో ఏఆర్ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ముగింపు కార్యక్రమంలో పరేడ్ కమాండర్‌గా ఆర్ఎస్సై గోపాలనాయుడు వ్యవహరించగా సిబ్బంది పరేడ్ చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సౌమ్యలత, విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఆర్ఎస్సైలు రమేష్ కుమార్, శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు లీలారావు, చౌదరి, రూరల్ సీఐ లక్ష్మణరావు, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఓపెనింగ్ స్థాయి చదరంగం పోటీలకు అనూహ్యస్పందన లభించింది. భోగేశ్వరరావు–ఝాన్సీరాణి మెమోరియల్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు స్థానిక రింగ్‌రోడ్డులో ఉన్న ఫైర్ చెస్ స్కూల్‌లో ఆంధ్రా చెస్ అసోసియేషన్ సీఈఓ కేవీ. జ్వాలాముఖి పర్యవేక్షణలో జరిగాయి. ఈ పోటీలలో ఐదు జిల్లాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా జె. నాగరాజు, బి.శ్రావ్యశ్రీ, బి.సాకేత్ నిలిచారు. వారికి నిర్వాహకులు నగదు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫైర్ చెస్ స్కూల్ సిబ్బంది పి. అర్చన, ఎస్.పద్మ, ఎ.దామోదర రావు పాల్గొన్నారు.

నాలుగు ఆవుల అపహరణ

దత్తిరాజేరు: మండలంలోని తాడెందొరవలస కళ్లాల్లో ఉన్న నాలుగు ఆవులను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారు జామున అపహరించినట్లు సర్పంచ్ పూడి తిరుపతిరావు తెలిపారు. గ్రామంలోని సుంకరి గోవిందమ్మకు చెందిన మూడు ఆవులు, తమటాడ రాముకు చెందిన ఒక ఆవును గుర్తు బొలెరో వ్యాన్‌లో వచ్చి తరలించుకుని వెళ్లి పోయినట్లు అక్కడ అడుగులను బట్టి తెలుస్తోందని ఈ విషయమై ఎస్ బూర్జవలస పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించినట్లు సర్పంచ్ చెప్పారు.

సారా స్థావరాలపై దాడులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణంలోని పాత రెల్లివీధిలో ముందస్తు సమాచారం మేరకు సారా స్థావరాలపై పట్టణ సీఐ కె.మురళీధర్ ఆదేశాల మేరకు సిబ్బంది దాడులు నిర్వహించారు. పాత రెల్లివీధిలో రెండుచోట్ల దాడులు నిర్వహించగా కోలబుట్టమ్మ అనే మహిళ ఇంట్లో 60లీటర్ల సారా అలాగే కోల రవికుమార్ అనే వ్యక్తి ఇంట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న 95 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా సారా తయారు చేసినా, విక్రయించినా, రవాణా చేసిన చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ఏసీబీకి చిక్కిన కమిషనర్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన కమిషనర్ సర్వేశ్వరావు, డ్రైవర్ రాజు

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ నగరపంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు రూ.20వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు సోమవారం సాయంత్రం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ పట్టణం సీతంపేట రోడ్డులోని కోటదుర్గ నర్సింగ్‌హోమ్‌లో 2017లో పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలైన గర్భిణి ప్రసవించారు. ఆ బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం కోసం ఆస్పత్రి నుంచి నగరపంచాయతీ కార్యాలయానికి దరఖాస్తు చేయగా జనన ధ్రువపత్రం మంజూరు చేశారు. జనన ధ్రువీకరణ పత్రం ప్రసవతేదీకి విరుద్ధంగా నర్సింగ్‌హోమ్ డాక్టర్ రౌతుభారతి నమోదుచేశారంటూ మరో ఉపాధ్యాయురాలు నగరపంచాయతీకి ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించిన పంచాయతీ అధికారులు తప్పును నిర్ధారించి జననధ్రువీకరణ పత్రం రద్దుచేశారు. వైద్యురాలితో రూ.500 ఫైన్ కట్టించారు. సరి చేసి ఇవ్వాలంటూ ఉపాధ్యాయురాలితో మళ్లీ దరఖాస్తు చేయించారు. చర్యలు తీసుకోకుండా ఫైన్‌తో సరిపెట్టేశారంటూ ఫిర్యాదుదారు ఆర్టీఐ కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిని అవకాశంగా మార్చుకున్న కమిషనర్... ఆర్టీఐ కమిషన్ వద్దకు వెళ్లాలంటే రూ.30 వేలు ఖర్చు అవుతుందని, ఆ మొత్తం చెల్లించాలని వైద్యురాలు భారతిని డిమాండ్ చేశారు. ఆమె రూ.20వేలు చెల్లించేందుకు అంగీకరించి, విషయం ఏసీబీ అధికారులకు చేరవేశారు. వారి సూచనల మేరకు డబ్బులు ఇస్తానని చెప్పడంతో నర్సింగ్ హోమ్‌కు కమిషనర్ తన డ్రైవర్ రాజును పంపించారు. అప్పటికే రూ.20వేల మొత్తానికి రంగుపూసిన 40 నోట్లును రాజుకు ఆమె అందజేశారు. అక్కడే మాటువేసి ఏసీబీ అధికారులు రాజును అదుపులోకి తీసుకున్నారు. ఈ నగదు ఎందుకు తీసుకున్నావని ప్రశ్నించడంతో కమిషనర్ తీసుకోమని చెప్పారని తెలిపాడు. ఆయనకు గట్టిగా హెచ్చరించి ఆ డబ్బుతో కమిషనర్ ఇంటి వద్దకు చేరుకుని రాజును లోపలకు పంపించారు. రాజు చేతిలో ఉన్న డబ్బులు కమిషనర్‌కు అందించగానే ఏసీబీ అధికారులు దాడి చేసి కమిషనర్‌ను అరెస్టు చేశారు. అక్కడ నుంచి కమిషనర్‌ను నగర పంచాయతీ కార్యాలయానికి తీసుకెళ్లి రెండు గంటల పాటు విచారణ జరిపారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వెల్లడించారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు కె.భాస్కరరావు, ఎస్.వి.రమణ, ఎస్ఐలు డి.సత్యారావు, కె.వాసునారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన



ఉమ్మడి జిల్లా గురుకులాల కోఆర్డినేటర్ రూపవతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ మధుబాబు, అధ్యాపకులు

• ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ రూపవతి

సీతానగరం: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఈ ఏడాది మార్చి నెలలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి జిల్లాలో శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు కష్టపడి పనిచేస్తున్నారని గురుకులాల కోఆర్డినేటర్ ఎస్ రూపవతి అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాన్ని సోమవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి మంచిఫలితాలు సాధించాలని కోరారు. జిల్లాలో 2024–25 విద్యాసంవత్సరం పరీక్షలకు టెన్త్‌లో 360 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 287 మంది, రెండవ సంవత్సరం పరీక్షలకు 223 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ ఏడాది అన్ని గురు కులాల్లో ప్రణాళికాబద్ధంగా విద్యను భోదిస్తున్నారన్నారు. అనంతరం జోగింపేట పాఠశాలలో వంటశాలను, వంటలను, మైదానాన్ని, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ రూపవతిని ప్రిన్సిపాల్ మధుబాబు, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేవీఎస్ మధు, సీనియర్ అధ్యాపకుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో నిలిచిన పనులు

• మాజీ డిప్యూటీ సీఎం వద్ద వాపోయిన గిరిజన సర్పంచ్‌లు



పీడిక రాజన్నదొరకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్‌లు, నాయకులు

సాలూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో మంజూరైన రోడ్ల పనులు నిలిచిపోయాయని పాచిపెంట మండలం కేరంగి, మిలియాకంచూరు తదితర పంచాయతీల సర్పంచ్‌లు వాపోయారు. ఈ మేరకు సోమవారం వారు రాజన్నదొరను సాలూరు పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో మీరు మంజూరుచేసిన కొండమోసూరు నుంచి అల్లంపాడు రోడ్డు, కేరంగి రోడ్డు జంక్షన్ నుంచి దొరలుద్దంగి రోడ్డు పనులు నేటికి ప్రారంభం కాలేదన్నారు. అంతేకాకుండా సర్పంచ్‌లైన తమకు తెలియకుండా తమ పంచాయతీల్లో పనులు చేపట్టడానికి కొంతమంది కాంట్రాక్టర్‌లు వస్తున్నారని తెలియజేశారు. ప్రజాప్రతినిధులుగా తాము గెలిచినా ఈ కూటమి ప్రభుత్వం తమ హక్కులను కాలరాస్తోందని వాపోయారు. ఈ మేరకు రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో మంజూరైన పనులు ఈ ప్రభుత్వంలో చేపట్టాలని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్‌లకు తెలియకుండా పనులు చేపట్టరాదని పేర్కొన్నారు. సర్పంచ్‌ల హక్కులకు భంగం కలిగితే, సర్పంచ్‌లకు అండగా తాను ఎప్పుడూ ఉంటానని స్పష్టంచేశారు.

ఆరోగ్యకరమైన ఆహారం చిరుధాన్యాలతో సాధ్యం

• గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి
• వర్సిటీలో మిల్లెట్ రెసిలెన్స్ సదస్సు ప్రారంభం



ముఖ్యఅతిథులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఆరోగ్యరమైన ఆహారంలో భాగంగా చిరుధాన్యాలు కీలకంగా నిలుస్తాయని అందుకే వాటితో తయారైన ఆహారాన్ని సూపర్ ఫుడ్‌గా పిలుస్తారని కేంద్రియ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక కేంద్రియ గిరిజన యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంగణంలో 'మిల్లెట్స్ క్వెస్ట్ 2025: బిల్డింగ్ రెసిలెన్స్, ఫీడింగ్ ది వరల్డ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించే సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో వివరించారు. 21వ శతాబ్దంలో మిల్లెట్ల వినియోగం, సంరక్షణ ప్రాముఖ్యత, ఆవశ్యకతను వెలుగులోకి తీసుకురావడం ఈ సెమినార్ ఉద్దేశమని తెలపారు. ఆరోగ్యకరమైన ఆహారం చిరుధాన్యాల ద్వారా అందుతుందని దీనిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. వాటిని పండించే రైతును ప్రోత్సహించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ సి.తారాసత్యవతి హాజరవగా రీసోర్స్ పర్సన్లుగా పర్యావరణవేత్త ప్రకృతివనం ప్రసాద్, మధ్యప్రదేశ్‌కు చెందిన మిల్లెట్స్ రాయబారి లహరిబాయి, గిరిజన రైతు పడాల భూదేవి, నారీశక్తి పురస్కార్, ఒడిశాలోని కోరాపుట్ మిల్లెట్ క్వీన్ ఆఫ్ ఇండియా రైమతి ఘియురియా హాజరయ్యారు. అనంతరం ముఖ్యఅతిథులను వీసీ ప్రొఫెసర్ కట్టిమణి ఘనంగా సత్కరించారు. గిరిజన అధ్యయన విభాగాధిపతి డాక్టర్ అనిరుధ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, వివిధ విభాగాల డీన్లు ప్రొఫెసర్ శరత్చంద్రబాబు, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.